మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## నాగర్‌కర్నూలు జిల్లాలో ఇసుక పంపిణీ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి

### ప్రతి ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 10 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లాలో ప్రజల అవసరాలు మరియు ప్రభుత్వ పనుల కోసం అవసరమైన ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ అధికారుల కు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రజల అవసరాలకు, అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవస రమైన ఇసుకను కూడా ఆన్‌లైన్ ద్వారానే పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుక పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ అవసరాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ట్రాక్టర్ యాజమాన్యాలు తమ వాహనాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుంటే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జీపీఎస్ కలిగి మైనింగ్ శాఖ వద్ద రిజిస్టర్ అయిన వాహనాల ద్వారానే ఇసుక రవాణాకు అనుమతించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 18 ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పర్యవేక్షణలో ఉండేలా చూడాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లోడింగ్ నిర్వహించాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనాలు పట్టుబడితే రూ.20 వేల వరకు జరిమానా విధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మరిన్ని ఇసుక రీచ్‌లు ప్రారంభించేందుకు తహసీల్దార్లు ఆన్‌లైన్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సి.సెక్షన్ తహసీల్దార్ రవికుమార్, వంగూర్, ఉప్పునుంతల, కల్వకుర్తి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మండల కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి

### గ్రామ గ్రామాన కాంగ్రెస్

## జెండానే ఎగరాలి

**కలిసికట్టుగా పనిచేద్దాం.. వనపర్తిని**
**మొదటి వరసలో నిలబెడదాం**
**గ్రామ అధ్యక్షుడి, బూత్ కన్వీనర్**
**పాత్ర కీలకంగా ఉంటుంది**
**వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి,**
**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శివసేన రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 10 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాన సంస్థగతంగా బలోపేతం అవ్వాలని, ఇందులో గ్రామ అధ్యక్షులతోపాటు బూత్ కన్వీనర్ల పాత్ర చాలా ప్రధానంగా ఉంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘణపురం, పెద్దమందడి మండలాల్లో ఏర్పాటుచేసిన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమంలో వారు –మిగతా4లో..

## డ్రగ్స్ అరికడదాం



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- మత్తుకు దూరంగా ఉండాలి..
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- గత ఏడాది 8.976 కిలోల గంజాయి స్వాధీనం
- కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 10 ప్రభాత వార్త:** జిల్లాలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టి, డ్రగ్స్ మత్తు పదార్థాల వ్యసనాల నుంచి విద్యార్థులు, యువతను కాపాడేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పోలీసు, విద్య, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ, డ్రగ్ కంట్రోల్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆమె సూచించారు. ప్రత్యేకంగా విద్య, వైద్యం, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ప్రతి నెల కనీసం ఐదు పాఠశాలల్లో మత్తు పదార్థాల వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పోలీసు శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ అందించి అవసరమైతే పునరావాస కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారులు జనవరి–ఫిబ్రవరి నెలల్లో 375 గ్రాముల గంజాయి, 325 గ్రాముల ఆల్ప్రజోల్ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి మూడు కేసులు నమోదు చేసి చేసినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే 2025 సంవత్సరంలో మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించి మొత్తం 41 మందిపై 21 కేసులు నమోదు చేసి 8.976 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామనిఅధికారులు తెలిపారు. గంజాయి సహా ఇతర హానికర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాల తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు మరియు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మత్తు పదార్థాల వ్యసనానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమగ్ర కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి మొక్కల అక్రమ పెంపకం గుర్తించారా అని కలెక్టర్ ప్రశ్నించగా, ఎక్సైజ్ అధికారులు స్పందిస్తూ 2023 సంవత్సరంలో ఒకటి లేదా రెండు కేసులు గుర్తించామని, అయితే గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో గంజాయి మొక్కల అక్రమ పెంపకం –మిగతా4లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

### వంద పడకలతో

## జడ్చర్ల దవాఖాన

**బాలానగర్ ఆస్పత్రిలో పడకల సంఖ్య 23 నుంచి**
**30కి పెంపు : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి**

**జడ్చర్ల, మార్చి 10 ప్రభాతవార్త :** జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో పడకల సంఖ్యను 50 నుంచి 100 కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. గతంలో జడ్చర్ల ఆస్పత్రిలోని పడకల సంఖ్యను 50 కు తగ్గిస్తూ గత ఏడాదిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. అయితే పడకల సంఖ్యను తగ్గించిన కారణంగా ఆమేరకు ఆస్పత్రికి కేటాయించే సిబ్బంది, సౌకర్యాలు కూడా తగ్గిపోతాయని ప్రజల్లో ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో ఈ విషయాన్ని తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. దీంతో ప్రభుత్వం జడ్చర్ల (బాదేపల్లి) ఆస్పత్రిలో పడకల సంఖ్యను 50నుంచి 100కు పెంచుతూ వైద్యవిధాన పరిషత్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. దీంతో జడ్చర్ల ఆస్పత్రికి వంద పడకల ఆస్పత్రికి వచ్చే అన్ని సౌకర్యాలు లభిస్తాయని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే బాలానగర్ సీహెచ్‌సీ లో పడకల సంఖ్యను గతంలో 30నుంచి 23కు తగ్గించగా దీన్ని కూడా మళ్లీ 30 పడకలకు పెంచుతూ ప్రభుత్వం వైద్యవిధాన పరిషత్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రగతి పనులకు అందరూ సహకరించండి

**- దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి, - భూత్పూర్‌లో ప్రగతి ప్రణాళిక పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్**

**భూత్పూర్, మార్చి 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సమాజాభివృద్ధికి చేపడుతున్న ప్రగతి పనులకు పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సమిష్టిగా కృషిచేస్తూ, అభివృద్ధికి సహకరించాలని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మున్సిపాలిటీ చేపట్టిన పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. చీపురు పట్టి రోడ్లు ఊడ్చి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం భూత్పూర్ చౌరస్తాలో ఏర్పాటైన బహిరంగసభలో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల యాక్షన్ ప్లాన్‌గా ఐదు దశల్లో ఐదు ప్రత్యేక కార్యక్రమాలు 99రోజులు జరుగుతున్నాయని తెలిపారు. ఏప్రిల్ రెండున గ్రామ సభలు, గ్రామస్థాయి కార్యక్రమాలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు, మే 2న నియోజకవర్గస్థాయి కార్యక్రమాలు, మే22న జిల్లా స్థాయి కార్యక్రమాలు, జూన్ రెండున తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశుభ్రత, ఆరోగ్యం, క్రీడలు, విద్య, పిల్లల భద్రత, డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయడం, రైతు సంక్షేమం, వ్యవసాయం,



భూత్పూర్‌లో ప్రగతి ప్రణాళిక పనుల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మహిళలు, పర్యావరణం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రగతి వైపు అడుగులేస్తోందన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాల్ని ప్రజలు, ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాలనీలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతీ పౌరుడు కూడా పరిశుభ్రతను కాపాడడంలో భాగస్వామ్యంకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

**మున్సిపాలిటీ ఆర్పీలు, మహిళా సర్పంచులు, మహిళా కౌన్సిలర్లను సన్మానించిన ఎమ్మెల్యే**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా ఆర్పీలు, మహిళా సర్పంచులు, మహిళా కౌన్సిలర్లను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మడావత్ బాలకోటి, వైస్ చైర్మన్ లిక్కి సూర్యకళ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మున్సిపల్ కమిషనర్ పి చంద్రశేఖర్‌రావు, రెండో వార్డు కౌన్సిలర్ నిమ్మల అన్నపూర్ణ, మూడో వార్డు కౌన్సిలర్ పాల్త్యావత్ లాల్య, నాల్గో వార్డు –మిగతా4లో..



పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని చీపురు పట్టి రోడ్లు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



ఎంజిఎల్‌ఐ కాలువ వద్ద సాగునీటి కోసం రైతుల వివాదం

### ఎంజిఎల్‌ఐ సాగునీటి కోసం

## రైతుల వివాదం

**బిజినేపల్లి, మార్చి10 ప్రభాతవార్త:** సల్కర్‌పేట గ్రామసమీపంలోని మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ డీ10 క్రాస్‌రెగ్యులేటర్ కాలువ వద్ద మంగళవారం సాగునీటి కోసం రైతుల వివాదం నెలకొంది. నందివడ్డేమాన్, ఖానాపూర్ గ్రామాల రైతులు రబీలో సాగుచేసిన మొక్కజొన్న వరి తదితర పంటలకు వారంరోజులుగా సాగునీరు అందడంలేదని క్రాస్ రెగ్యులేటర్ కాలువ వద్ద ఆందోళనకు దిగారు. ఎత్తు ప్రాంతంలో ఉన్న గ్రామాలకు సాగునీరు అందకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండు దశకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీ 10 క్రాస్ రెగ్యులేటర్ తూములను మూసి తమ గ్రామాలకు సాగునీరు అందే విధంగా చూడాలని అధికారులను కోరారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు సాగునీరు పూర్తిగా వెళ్లి తమ పంటలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. దీంతో అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని అన్ని గ్రామాలకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టి రైతులను శాంతింపజేశారు. డీ 10 క్రాస్ రెగ్యులేటర్ కాలువ వద్దకు ఎస్సీ పార్థసారథి , ఏఈ గౌతమ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### ఇప్పసారాను ప్రోత్సహించాలన్న

## ఎమ్మెల్యే వ్యాఖ్యలు దురదృష్టకరం

**జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బాలవర్ధన్ గౌడ్**



**జడ్చర్ల, మార్చి10 ప్రభాతవార్త :** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఇప్పపూల సారాను ప్రోత్సహించాలని చేసిన వ్యాఖ్యలు సమాజానికి హానికరమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. మద్యం కారణంగా గతంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక సారా వ్యతిరేక ఉద్యమాలు జరిగాయని, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పోరాటాలు చేసి సారా దుకాణాలను మూసివేయించే పరిస్థితి గతంలో అనేక సందర్భాలలో వచ్చాయని ఆయన గుర్తు చేశారు. అలాంటి చరిత్రను విస్మరించి మళ్లీ సారా తయారీ, విక్రయాలపై చర్చలు తెరపైకి తీసుకురావడం బాధాకరమన్నారు. సారాను గ్లోబల్ బ్రాండ్‌గా తయారు చేయాలని మాట్లాడటం ప్రజల సమస్యలను అర్థం చేసుకోకపోవడమేనని బాలవర్ధన్ గౌడ్ విమర్శించారు. గిరిజనులకు ఉపాధి కల్పించాలనే పేరుతో మద్యాన్ని ప్రోత్సహించడం సరైన మార్గం కాదని, ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేస్తేనే నిజమైన ఉపాధి అవకాశాలు వస్తాయని సూచించారు. గతంలో సారా దుకాణాల వల్ల జరిగిన సామాజిక సమస్యలను మరచిపోకుండా ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు.

### జీవితంలో ఎంత ఎదిగినా

## ఒదిగి ఉండాలి

**రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**
**పీఎంశ్రీ జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయురాలు జి. విజయలక్ష్మికి ఘన వీడ్కోలు**

4

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో

## ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

**గద్వాల మార్చి 10, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయంగా నిర్వహించేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 12వ తేదీన స్థానిక సంస్థల, ఇతర ప్రజాప్రతినిధులతో నిర్వహించు శిక్షణ కార్యక్రమంపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగేందుకు 99 రోజుల ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 12వ తేదీన ప్రజాప్రతినిధులకు నిర్వహించు శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఇప్పటికే షెడ్యూల్ తయారు చేయడం జరిగిందని, దాని ప్రకారం జూన్ 12వ తేదీ వరకు ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని సిఎస్ పిలుపునిచ్చారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



వీసీలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు

మాట్లాడుతూ ఈనెల 12న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో ఉదయం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పది థీమ్‌లను వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై తెలియజేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి వివిధ సంక్షేమ పథకాలు పొందుతున్న వారి సంఖ్య, ఇతర వివరాలన్నీ క్రోడీకరించడం జరుగుతుందన్నారు. ఆయా అంశాలను సజావుగా – మిగతా4లో..

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- రూ.3 కోట్ల 50 లక్షలతో అదనపు నియంత్రికల ఏర్పాటు
- వనపర్తి పట్టణానికి అదనంగా 13 నియంత్రికల ఏర్పాటు
- జిల్లా మొత్తంలో 250 నియంత్రికల ఏర్పాటు : ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 10 ప్రభాతవార్త :** వేసవిలో విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని లో వోల్టేజ్, ఓవర్ లోడ్ సమస్యలను తగ్గించేందుకు వనపర్తి జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని 23వ వార్డులో ఏర్పాటు చేసిన నూతన నియంత్రికను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కోట్ల 50 లక్షల రూపాయలతో వనపర్తి జిల్లా వ్యాప్తంగా 250 నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 13 నియంత్రికలను వనపర్తి పట్టణంలోనే ఏర్పాటు చేసినట్లు ఆయన



నూతన నియంత్రికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడం వలన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని అందుకు అనుగుణంగానే ఈ నియంత్రికల ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు, విద్యుత్ శాఖ అధికారులు ఎస్ఇ తిరుపతిరావు, డిఇ శ్రీనివాస్, ఎడి శ్రీనివాస్, సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలతో గుర్తింపు..**

జిల్లాస్థాయి క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనరెడ్డి వనపర్తి మండలం చిన్న గుంట పల్లి గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వివేకనంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను మంగళవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు ఉన్నత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారిస్తే ప్రపంచ స్థాయి గుర్తింపును పొందవచ్చునని వారు పేర్కొన్నారు. జిల్లా క్రికెట్ క్రీడా పోటీలలో 32 జట్లు పాల్గొంటున్నాయని క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సమానమని ఎవరు ఎలాంటి నిరుత్సాహానికి గురి కాకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మండలం మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య శివ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ చూపిన మార్గంలో నడుద్దాం



వేడుకల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్

**బిజినేపల్లి, మార్చి 10 ప్రభాతవార్త:** సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని బొర్సు గడ్డ తండా సర్పంచ్ లలిత రవినాయక్ అన్నారు. తండాలో రాత్లావత్ పుణ్య కుమార్తె వివాహానికి హాజరై ఐదువేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సర్పంచ్ లలిత మాట్లాడుతూ గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. చదువు ఏ ఒక్కరి సొత్తూ కాదని, పిల్లలు బాగా చదివితేనే వారి బంగారు భవిష్యత్తుకు మార్గం ఏర్పడుతుందన్నారు. బాల్య వివాహాల వ్యవస్థను రూపుమాపుదామని కోరారు. గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. గ్రామపంచాయతీ పరిధిలో మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఆర్థిక సాధికారతపై దృష్టి సారిస్తూ విద్య, వ్యవసాయం, పశుపోషణ ద్వారా గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కృషి జరుగుతోంది అన్నారు. ప్రభుత్వం బొర్సు గడ్డ తండాకు బీటీ రోడ్డు మార్గానికి నిధులు కేటాయించి గిరిజనుల కష్టాలను తీర్చాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్ చాప్లి, పుణ్య కేస్లీ, రెడ్యా, రాములు, జ్యోతి, అనూష ,రాజీ సక్రు, కాలియా, దేనియా, బద్య, పుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంగి విజయ్

**బిజినేపల్లి, మార్చి 10 ప్రభాతవార్త:** ఎన్నో అవమానాలు, అవహేళనలను అధిగమించి మహిళలకు చదువు, సంస్కారం నేర్పిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని దళిత బహుజన సంఘం రాష్ట్ర నాయకులు మంగి విజయ్ అన్నారు. పూలే అంబేద్కర్ చౌరస్తాలో సావిత్రిబాయి వర్ధంతి వేడుకల్లో బడుగు బలహీన వర్గాల నాయకులు ఘన నివాళి అర్పించారు. మంగి విజయ్ మాట్లాడుతూ సమాజంలో మహిళా సాధికారతకు కృషి చేసిన మహనీయులు అన్నారు. సమాజ చైతన్యం విద్య ద్వారా సాధ్యపడుతుందని మహిళలు విద్యను అభ్యసించి మహిళా ఉపాధ్యాయినులుగా అనేక రంగాల్లో చరిత్రపుటల్లో తమదైన స్థానాన్ని సంపాదించుకున్నారని వివరించారు. మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అని నేటి సమాజంలో ప్రతి సామాన్యుడికి, మహిళలకు చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పిన వీర వనిత సావిత్రిబాయి పూలే అన్నారు. మహిళలను విద్యావంతు లుగా చేసేందుకు సమాజ కట్టుబాట్లను కాదనే సాహసాన్ని చేసి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగాపేరు పొందారని ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచులు ఉప్పనమోని లక్ష్మమ్మ, కొంగరి శంకర్, బీసీ సంఘం నాయకులు వెంకటస్వామి, రాజేందర్ గౌడ్, సత్యశీల సాగర్, శ్రీనివాసులు ,రమేష్ అల్లోజీ శంకర్ గౌడ్, గోపాల్ , వెంకటేష్, గఫూర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి సందేశ్ ఖేల్ మహోత్సవ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, మార్చి 10 ప్రభాతవార్త :** నారాయణపేట యువతను క్రీడల వైపు ప్రోత్సహించే లక్ష్యంతో ప్రధాన మంత్రి సందేశ్ ఖేల్ మహోత్సవ్ నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ పిలుపు మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ మాట్లాడుతూ క్రీడా పోటీలు ఏప్రిల్ 9 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యే ఈ మహోత్సవం మహబూబ్‌నగర్‌లో ముగింపు కార్యక్రమంతో ముగుస్తుందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని అన్ని మండలాల యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతి యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. పాల్గొనదలచిన క్రీడాకారులు పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్ లేదా ఆన్‌లైన్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడమే ఈ మహోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువతను డి.కె. అరుణ కోరారు. ఈ సమావేశంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు రతన్ పాన్ రెడ్డి, కౌన్సిలర్లు సత్య, రఘుపాల్, రఘురామయ్య గౌడ్, కమలాపురి ప్రభాకర్, జాతీయ న్యాయసలహాదారు రఘువీర్ యాదవ్, టౌన్ అధ్యక్షుడు పోషల్ వినోద్, మీడియా కన్వీనర్ కిరణ్ ధగే, శ్యాంసుందర్ గౌడ్, మిర్చి వెంకటయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలకు సహకరించండి : చైర్మన్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

**ఆత్మకూర్ మార్చి 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రగతి ప్రణాళికలకు ప్రజలు తమ వంతు తోడ్పాటున అందించాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి వైస్ చైర్ పర్సన్ నల్లగొండ శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ శశిదార్ తదితరులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని రెండవ వార్డులో మున్సిపల్ కమిషనర్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ పలువురు ప్రభుత్వ అధికారులు విస్తృతంగా పర్యటించి తడి చెత్త మరియు పొడి చెత్త నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన సమస్యలను క్రోడీకరించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు ప్రగతి ప్రణాళిక రూపొందించడమే కాకుండా ప్రజలకు అందుబాటులో అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా వారు తెలిపారు. ప్రధానంగా పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలు అవగాహన పెంచుకొని అంటువ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు చేపట్టే చర్యలకు తోడ్పాటు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్, మని వర్ధ, గాలి పంపు శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్లు దండు శ్రీనివాసులు, సాజిదా బేగం, తదితరులతోపాటుగా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు..

## వెయ్యి బీడీలకు రూ .400 కూలి పెంచాలి

**తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్**

**చిన్నచింతకుంట, మార్చి10 ప్రభాతవార్త :** వెయ్యి బీడీలకు 400 రూపాయలు కూలి పెంచాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు దేవదానం డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో పాత కూలి ఒప్పందం ఈనెల మార్చి 30 తేదీ వరకు ముగుస్తుందని, కూలి వేతనం ఏప్రిల్ నుంచి పెంచాలని డిమాండ్‌చేస్తూ ఈనెల12న మండల కేంద్రంలో బీడీ కార్మికుల పోరు గర్జన విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీడీ కూలి రేట్లు పెంచాలని డిమాండ్ నోటీసును ఆయా బీడీ యజమాన్యాలకు కార్మికుల ర్యాలీతో వెళ్లి అందజేసి చేస్తామన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెంచుకోవాలని ఈ గర్జనకు కార్మికుల అధిక సంఖ్యలో కదలిరావాలని పిలుపునిచ్చారు. దీంతో పాటుగా జరిమానాలు తగ్గించాలని, ప్రావిడెంట్‌ఫండ్‌లో ఖాతాలో పేర్లు, వయసు తప్పులను యజమాన్యమే సరిచేసి కార్మికులకు రిటైర్మెంట్ డబ్బులు వచ్చేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలోయూనియన్ జిల్లాఅధ్యక్షులు కొండన్న, ఉపాధ్యక్షులు కోళ్లవెంకటన్న, గుండన్నలు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**దామరగిద్ద, మార్చి10 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి గృహప్రవేశ కార్యక్రమాలకు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫణిందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దామరగిద్ద మండలంలోని దామరగిద్ద గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలు చేసే ఏ ఒక్కరిని వదలి పెట్టం

**అసత్య ప్రచారాలకు భయపడే వ్యక్తిని కాదు...**

**వారి అక్రమాలు వెలికితీస్తుంటే.. గిట్టకనే నాపై దుష్ప్రచారం..**

**ఇంటెలిజెన్స్ విధులు కూడా అక్రమ వ్యాపారులే చేస్తున్నారా..?**

**బీసీ నాయకులపై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం**

**మీ భరతం పట్టే వరకు విశ్రమించేది లేదు**

**బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

**వనపర్తి, మార్చి 10 ప్రభాతవార్త :** తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య దుష్ప్రచారాలకు భయపడే వ్యక్తిని కాదని, తప్పుడు ప్రచారాలు చేసే ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు తమపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీనిపై ఫిబ్రవరి 4వ తారీఖున తెలంగాణ డిజిపికి, కొత్తకోట పోలీస్ స్టేషన్లో, సైబర్ క్రైమ్ లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అందులో కొందరి పేర్లు మా దృష్టికి వచ్చినప్పటికీ వారిలో కొందరు ప్రముఖ రంగంలో ఉండడంవల్ల అక్కడితో వదిలేయడం కూడా జరిగిందన్నారు. కానీ తిరిగి మంగళవారం తనను జిల్లా నుంచి బహిష్కరించినట్లు అదే వ్యక్తులు సోషల్ మీడియాలో వైరల్ చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చెందిన భూమా రాజగోపాల్ రెడ్డి అనే వ్యక్తిని సోషల్ మీడియా గ్రూపులో యాడ్ చేసి తనను అప్రతిష్ట పాలు చేసే కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. తాను ఎక్కడైనా ఒక్క రూపాయి అవినీతికి పాల్పడితే, రైస్ మిల్లర్లు, పెట్రోల్ పంపులు, ఇండస్ట్రీస్, స్కూల్స్, కాలేజీలు వంటి దగ్గర ఒక్క రూపాయి వసూలు చేసినట్లు ఆధారం ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. అవినీతి అక్రమాలు మీరు చేసుకుంటూ ఇతరులపై నిందారోపణలు మోపడం క్షమించరాని నేరమన్నారు. భూమా రాజగోపాల్ రెడ్డి అనే ఒక సైకో వెదవకు జిల్లాలోని కొంతమంది రెడ్లు కలిసి బీసీల ఎదుగుదలను చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా అవినీతి అక్రమాలపై నిరంతర పోరాటం సాగిస్తున్నామని, అందులో భాగంగానే ఎక్సైజ్ సూపరింటెండెంట్, సివిల్ సప్లయ్ డిఎం, బీసీ వెల్ఫేర్ అధికారి వంటి కొంతమంది అవినీతి అధికారులపై బీసీ పొలిటికల్ జేఏసీ చేసిన పోరాట ఫలితంగానే సస్పెండ్ కావడం జరిగిందని గుర్తు చేశారు. మీరు చేసే అవినీతిపై ప్రశ్నించినందుకే తనను సోషల్ మీడియా వేదికగా టార్గెట్ చేశారని, ఇకనుంచి ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దమ్ము ధైర్యం లేకపోతే పెట్టిన పోస్టును ఎందుకు తొలగించారని, ఆడంగి వేషాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ఎలాంటి కార్డు లేకున్నా మిల్లుల దగ్గర వసూలు చేసింది, ఇసుక మాఫియా దగ్గర వసూలు చేసిన విషయాలు, పెట్రోల్ పంపులు దగ్గర, పాఠశాలల్లో, కాలేజీల్లో మీరు చేసిన అక్రమ వసూళ్లను బయటపెట్టి మీ భరతం పట్టే రోజులు దగ్గరకు వచ్చాయని హెచ్చరించారు. తమ సొంత పనుల కోసం కొన్ని రోజులు ప్రజల మధ్య లేకపోయేసరికి ఇలాంటి గ్రామ సింహాలు వీధిన పడి మొరుగుతున్నాయని ఘాటు విమర్శలు చేశారు. బహిష్కరించినట్లు పోస్టులు పెడితే అధికార యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. పోలీస్ విధులు, ఇంటలిజెన్స్ విధులు కూడా అక్రమార్కులే నిర్వహిస్తున్నారని, దీనిపై జిల్లా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఐటి యాక్ట్ పనిచేయడం లేదా? అని నిలదీశారు. ప్యాడి టెండర్లో పాల్గొనడానికి మక్తల్ నుంచి వచ్చిన వ్యక్తి అవినీతి బాగోతాలపై తమ పనితీరు చూపిస్తామని, మీ వెనుక ఉండి వ్యవహారాలు నడిపిస్తున్న వ్యక్తిని బయటికి లాగే వరకు రాచాల వదిలిపెట్టడని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు వివి గౌడ్, దేవర శివ, ధర్మేంద్ర సాగర్, అస్కని రమేష్, యశ్వంత్ గౌడ్, మ్యాదరి రాజు, సొప్పరి రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశ్ ఖేల్ మహోత్సవం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి**



ప్రధానమంత్రి ఖేల్ సంసాద్ మహోత్సవ గోడ పత్రిక విడుదల

**అమరచింత మార్చి 10, ప్రభాతవార్త :** దేశంలో క్రీడలను ప్రోత్సహించడానికి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంసాద్ ఖేల్ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో బిజెపి పట్టణ అధ్యక్షురాలు మంగ లావణ్య స్వగృహంలో ప్రధానమంత్రి సంసాద్ ఖేల్ మహోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంగ్లా లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహబూబ్నగర్ పార్లమెంటులో ఖేల్ సంసాద్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 9 నుండి 24వ తేదీ వరకు మండల, నియోజకవర్గ కేంద్రం తో పాటు పార్లమెంటు స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్నామని క్రీడల పై ఆసక్తి ఉన్న క్రీడాకారులు మార్చి 9 నుండి 24వ తేదీ వరకు క్యూ ఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించనున్న క్రీడలలో కబడ్డీ, క్రికెట్, కో కో, వాలీబాల్ ఉంటాయని క్రీడల్లో పాల్గొనేవారు పదహారేళ్ల నుండి 45 ఏళ్లు వారు పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో ఫైనల్లో విజయం సాధించిన జట్లకు బహుమతులతో పాటు నగర్ ప్రైజ్ మనీ ఉంటుందని పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు యువత పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షురాలు మంగ లావణ్య, కృష్ణంపల్లి సర్పంచ్, మల్లారెడ్డి, చంద్ర నాయక్ తండ సర్పంచ్, కృష్ణ నాయక్, బిజెపి సీనియర్ నాయకులు నరాల నారాయణ, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బోయాజ్ వాల్మీకి, తోకలి గణేష్, తోకలు వెంకటేష్, యువరాజు, టైలర్ నరసింహ, అజంత వెంకటేష్, అరవింద రెడ్డి, బాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా నాటుసారా బెల్టు షాపులు.. అడ్రస్ లేని అబ్కారీ శాఖ..

**ఉప్పునుంతల, మార్చి 10 ప్రభాతవార్త :** మండలంలో అన్ని శాఖల విభాగాల అధికారులు వారి విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న అధికారులు ఉన్నప్పటికీ మండల స్థాయిలో ఆబ్కారీ శాఖ అధికారుల అడ్రస్ ఎక్కడని మండల ప్రజలకు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో నాటు సారా ఏరులై పారుతున్న, సంబంధిత శాఖ అధికారుల అడ్రస్ లేదని మండల ప్రజలు వాపోతున్నారు. బెల్టు షాపులు మాత్రం గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న సంబంధిత ఎక్సైజ్ అధికారులు ముడుపులు దండుకొని వారి పట్ల చర్యలు తీసుకోవడం లేదని గ్రామాలలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించాల్సింది పోయి ఏం తెలియనట్టు, మండలానికి సంబంధించిన ఎక్సైజ్ అధికారులు ఉన్నారా, లేక శాఖ నిర్వీర్యం అయి పోయిందా అని మండల ప్రజలకు ప్రశ్నార్థకంగా మారింది. కానీ కల్తీ కల్లు వ్యాపారులకు, బెల్టు షాపు దుకాణాలకు, నల్ల బెల్లం వ్యాపారులకు, నాటు సారా విక్రయదారులకు సంబంధింత ఎక్సైజ్ శాఖ అధికారులు వారికి అందుబాటులో ఉంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడ దాడులు చేసినట్టు కనిపించడం లేదని, నాటు సారా, బెల్టు షాపులను నివారించే వారు లేరా కనీసం స్థానిక పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు పెట్టుకుంటున్నారు. బెల్ట్ షాపులు గుడి గోపురాల సమీపంలో నడిపిస్తుండగా, జాతీయ రహదారి సమీపంలో మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న నిబంధనలను తుంగలో తొక్కి వారి వద్ద అమ్యమ్యాలు సరిపుచ్చుకొని చేతులు దులుపుకొని మండలం పట్ల ఏం తెలియనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఎక్సైజ్ అధికారుల పట్ల తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం మండల ప్రజలకు ఎక్సైజ్ శాఖ అధికారులు అని కూడా తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉప్పునుంతల మండలం పట్ల ఏరులై పారుతున్న నాటుసారా, నల్ల బెల్లం వ్యాపారం, బెల్ట్ షాపుల బెడద, జాతీయ రహదారిపై కొనసాగుతున్న మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

## ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి

**ఉప్పునుంతల ఆలయంలో సన్నాహక సమావేశం**



బ్రహ్మోత్సవాలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, మార్చి 10 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర, తేరు ఉత్సాహ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న జరిగే శ్రీరామనవమి, తేరు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం గ్రామసర్పంచు చింతగాళ్ళ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశం జరిగింది. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా సాగేందుకు అందరి సహకారంతో ముందుకెళ్లాలని సమావేశంలో తీర్మానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో జరిగే కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి ప్రకటించారు. శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి అన్నదానం చేయడానికి దాత తిప్పర్తి నరసింహారెడ్డి, సూరం నారాయణరెడ్డి, రెండో రోజున బండ లాగుడు పోటీలు జరిగిన రోజు అన్నదాన కార్యక్రమం ఎడ్ల నరేష్ యాదవ్ లత్తిపూర్ గ్రామం, బండ లాగుడు పోటీలు విజేతలకు ప్రథమ బహుమతి రూ.80 వేలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ద్వితీయ బహుమతి రూ.60 వేలు మదనాగుల మైందర్ పిరట్వాన్ పల్లి, తృతీయ బహుమతి రూ.40 వేలు బొల్లె బాలయ్య **ఉప్పునుంతలలో కోలాటం పోటీలు..** బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కోలాటం పోటీల్లో విజేతలకు దాతలు రూ.25 వేలు కొత్త హనుమంతు రెడ్డి, ద్వితీయ బహుమతి దాత చీమర్ల బుచ్చి రెడ్డి, తృతీయ బహుమతి పాత్కుల రామచంద్రయ్య, ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.7 వేల 500, ద్వితీయ రూ.5 వేలు, తృతీయ బహుమతి గెలుపొందిన విజేతలకు మంజునాథ్ ట్రాక్టర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా చిరుతల భజన తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పూర్తి అయ్యేంత వరకు తాగునీరు మడ్డి తిరుపతయ్య గౌడ్ సౌజన్యంతో ఉచితంగా మంచినీళ్ళు సరఫరా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

**హాజరైన రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ హరిప్రియ**




సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ హరిప్రియ

**చిన్న చింతకుంట, మార్చి 10 ప్రభాతవార్త :** మండలంలోని అమ్మాపూర్ సమీపంలో గల తిప్పలగుట్టలో క్వారీ ఏర్పాటుపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహించారు. సర్వేనెంబర్ 89 లో లక్ష్మీ శ్రీ కు చెందిన లీజ్ ఏరియా అయినా 4.95 హెక్టార్ల విస్తీర్ణంలో రాయి కంకర సంవత్సరానికి 90. 970 క్యూబిక్ మీటర్ల మైనింగ్ చేయుటకు ప్రతిపాదించిన క్వారీపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ హరిప్రియ తెలిపారు. క్వారీ సమీపంలోని అమ్మ పూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ పొలాల రైతులు, ఎన్జీవోలు, వివిధ రాజకీయ పార్టీ నేతలతో అభిప్రాయాలను తెలుసుకొని రికార్డ్ చేసుకున్నారు.

**రైతుల అభిప్రాయాలు...**

క్వారీ ఏర్పాటు వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని మా వ్యవసాయ పొలాలకు రహదారులు ఏర్పాటు చేశారని కొందరు రైతులు తెలిపారు. క్వారీ ఏర్పాటు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని సమీపంలోని ప్రసిద్ధ శ్రీ కురుమూర్తి పుణ్యక్షేత్రం ఉందని ఈ క్వారీ వల్ల రాయిని వెలికి తీసేందుకు వాడే బ్లాస్టింగ్ ల వల్ల స్వామివారి ఆలయం దెబ్బతింటుందని మరి కొందరు రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు క్వారీ ఏర్పాటు చేసి పర్యావరణం దెబ్బతినకుండా మొక్కల పెంపకం, స్థానికులకు ఉద్యోగాలు కల్పించి, రైతులు పండించే పంటలకు నష్టం కలగకుండా చూడాలని బ్లాస్టింగ్ సమయంలో సరికొత్త టెక్నాలజీ బ్లాస్టింగ్ సిస్టంను వాడాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా క్వారీ యజమానులు పాటించాలని ఎన్జీవోలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో క్వారీలో బ్లాస్టింగ్ వల్ల పర్యావరణం దెబ్బ తినడమే కాకుండా వ్యవసాయానికి తీవ్ర నష్టం ఏర్పడుతుందని వివిధ రాజకీయ పార్టీ నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులు, ఎన్జీవోలు వివిధ రాజకీయ పార్టీల నేతల అభిప్రాయాలను సేకరించినట్లు రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ హరిప్రియ తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికను సంబంధిత శాఖకు పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ అధికారి రవి, తహసిల్దార్ ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ వరలక్ష్మిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నూతన తహసిల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**శ్రీరంగాపూర్, మార్చి 10 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి నూతన తహసిల్దారుగా వరలక్ష్మి శనివారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం తాసిల్దార్ వరలక్ష్మిని శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలో రామచందర్‌యాదవ్, గ్రామ అధ్యక్షులు గోవిందు, వార్డు మెంబర్ నవీద్, విష్ణు ముదిరాజ్, బహుజన రమేష్, సమీర్, రంగస్వామి రామరాజు, వెంకటేష్, టిపిసిసి మీడియా కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ ఎస్.పురుషోత్తం యాదవ్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, మార్చి 10 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలో పీఆర్‌టీయూ టీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెద్ద జట్రం, అవుసలోని పల్లి, బిజ్వార్, పులిమామిడి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద జట్రం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గౌరమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు అనిల్, వెంకటేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ టీఎస్ సంఘం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కారుకొండలో స్వయం పరిపాలన దినోత్సవం

**బిజినేపల్లి, మార్చి 10 ప్రభాతవార్త :** కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా, డీఈవో, హెచ్ఎం, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు. అనంత రం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంఈఓ మురళీకృష్ణ

**చిన్నచింతకుంట, మార్చి10 ప్రభాతవార్త :** ఈనెల 14న జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాధికారి మురళీకృష్ణ కోరారు. మంగళవారం లాల్కోట జడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలను విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని ఆయన సూచించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నుల కిట్లను అందజేశారు. పది పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున పారితోషకం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది మనోహర్ రెడ్డి ప్రకటించారు. పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నేపాల్, సాయి చరణ్, వెంకట్ రాములు, సిఆర్పి విజయ్ సింహ, ఎన్నారై సాయికుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ వద్ద కరువైన పర్యవేక్షణ

◆ పంచాయతీ ట్రాక్టర్ దగ్ధం ◆ రామకృష్ణపల్లి డంపింగ్ యార్డ్ వద్ద ఘటన



డంపింగ్ యార్డు వద్ద కాలిపోయిన ట్రాక్టర్

**ధన్వాడ, మార్చి 10 (ప్రభాతవార్త):** ధన్వాడ మండలంలోని రామకృష్ణపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ అగ్నికి ఆహుతైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం సుమారు 2.30గంటల ప్రాంతంలో గ్రామంలోని డంపింగ్ యార్డ్ వద్ద నిలిపి ఉంచిన పంచాయతీ ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయింది. గ్రామస్థుల వివరాల ప్రకారం, డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న చెత్త కుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో మంటలు పక్కనే నిలిపి ఉంచిన పంచాయతీ ట్రాక్టర్‌కు అంటుకుని కొద్దిసేపట్లోనే ముందు భాగం రెండు టైర్లు ఇంజన్ పెద్ద టైరు ట్రాక్టర్ వైరింగ్ మొత్తం పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. ఈ ఘటనలో గ్రామపంచాయతీకి సుమారు లక్ష వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని గ్రామ ప్రజలు భావిస్తున్నారు. అయితే ఈ సంఘటన సోమవారం జరిగినప్పటికీ మంగళవారం వరకు బయటకు రాకపోవడం గమనార్హం. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా, అవును.. నిన్న మధ్యాహ్నం డంపింగ్ యార్డ్‌వద్ద చెత్తకు ఎవరో నిప్పంటించడంతో మంటలు ట్రాక్టర్‌కు అంటుకున్నాయి" అని తెలిపారు. అయినా ఈ ఘటనపై అధికారుల స్పందన ఆలస్యంగా రావడం, డంపింగ్ యార్డ్ వద్ద పర్యవేక్షణ లేకపోవడం పట్ల గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే ఘటనపై విచారణ చేపట్టి నష్టంపై పూర్తి వివరాలు వెల్లడించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# భూత్పూర్ మండలంలో పశువైద్యశిబిరాలు

-మార్చి 10 నుంచి ఏప్రిల్ 9 వరకు శిబిరాలు

**భూత్పూర్, మార్చి 10, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలంలో ఈ నెల 10నుంచి వచ్చే 9వ తేదీ వరకు నెలరోజుల పాటు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్ తెలిపారు. పశువులలో ముఖ్యంగా గేదెలలో తరచూ సంభవించే గాలికుంటు వ్యాధి నివారణ కోసం ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు తమ గేదెలు, ఇతర పశువులను గాలికుంటు వ్యాధి నుంచి కాపాడుకునేందుకు వైద్య శిబిరాలకు తరలిరావాలని సూచించారు. ఈ నెల 10,11వ తేదీలలో భూత్పూర్, అన్నాసాగర్, కొత్త మొల్గరలో, 12పశేర్పల్లి(బి), అన్నాసాగర్, కొత్తమొల్గరలో, 13,14వ తేదీలలో నర్సింగాపూర్, అన్నాసాగర్, పాతమొల్గరలో, 16న గోప్లాపూర్, అన్నాసాగర్, పాతమొల్గరలో, 17,18వ తేదీలలో పోతుల మడుగు, రావులపల్లి, కప్పెటలో, 20న గోపన్నపల్లి, రావులపల్లి, కప్పెటలో, 23,24వ తేదీలలో తాటిపర్తి, రావులపల్లి, ఎల్కిచర్లలో, 25,26వ తేదీలలో కొత్తూర్, తాటికొండ, ఎల్కిచర్లలో, 28న పెద్దతండా, తాటికొండ, మద్దిగట్లలో, 30,31వ తేదీలలో అమిస్తాపూర్, తాటికొండ, మద్దిగట్లలో, ఏప్రిల్ 1,2వతేదీలలో హస్నాపూర్, తాటికొండ, కరివెనలో, 4,6వ తేదీలలో శేర్పల్లి(హెచ్), తాటికొండ, కరివెనలో, 7,8,9వ తేదీలలో వసురాంతండా, భట్టుపల్లి, నక్కలబండతండాలతో పాటు ఇతర మిగిలిపోయిన గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్ తెలిపారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రజా పాలన భాగంగా పరిశుభ్రత కార్యక్రమం



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

**మద్దూరు, మార్చి10 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు పట్టణంలోని 1వ వార్డులో పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సరస్వతి జనార్ధన్, 1వ వార్డు సభ్యురాలు సంగీత రమేష్ నాయక్ మాట్లాడుతూ దుకాణదారులు రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త వాహనంలోనే వేయాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరసింహులు, ప్రకాష్, చందు, గణప రవి, నర్సింలుగౌడ్, జంగం బాబు, యాసిన్, సన్నీ, వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి




పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

**కోయిలకొండ మార్చి 10, ప్రభాతవార్త:** కోయిలకొండ మండలం పారుపల్లి గ్రామంలోని శ్వేతా విద్యా మందిర్ హై స్కూల్లో చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి విజయకేతన ఎగరవేయాలని పాఠశాల చైర్మన్ నరేందర్ విద్యార్థుల కు సూచించారు. మంగళవారం పాఠశాలలో ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ శ్వేత విద్యా మందిర్ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు గతంలో మంచి ఫలితాలు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరం సైతం మన పాఠశాల విద్యార్థులు కష్టపడకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పలు సాంస్కృతికకార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్యాలకు, పాటలకు సహచర విద్యార్థులు ఈలలతో ప్రోత్సహించారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, విద్యార్థులఉపన్యాసాలు పలు అంశాలపై ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహార, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా హైస్కూల్‌లో వార్షికోత్సవం

**ఉప్పునుంతల, మార్చి 10 (ప్రభాతవార్త):** స్థానిక పిఎం శ్రీజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంసానిపల్లి హైస్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వేయించడం పట్ల పాఠశాలలో కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు, కళల్లోనూ తమకు సాటి లెరనీ విద్యార్థులు నిరూపించుకున్నారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించడం నాటకాలు, సామాజిక అంశాలను ప్రతిబింబించాయి. విద్యార్థుల అభినయం, సంభాషణలు, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తదుపరి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు జానపద, దేశభక్తి గేయాలకు చేసిన నృత్యాలు ప్రత్యేకంగా ఆకర్షణంగా నిలిచాయి. వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీల్లో ప్రతిభ కనపర్చిన గీతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నర్మద, పాఠశాల ఉపాధ్యాయులు నీల శ్రీధర్, పోకల సతీష్, చంద్రశేఖర్, శ్యాంసుందర్ గౌడ్, అజ్మతుల్లా, శ్రీనివాసులు, రాజవర్ధన్ రెడ్డి, ఆర్ . మల్లారెడ్డి, వీరోజు రాజు, శ్యామలగౌరి, బిల్కిస్, కల్పన, కవిత, శ్రీలత, అంజన్ కుమార్‌పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి

◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 10 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"ను అచ్చంపేట మున్సిపాలిటీలో సమర్థవంతంగా అమలు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశించారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని 3వ వార్డు హిందూ స్మశాన వాటికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన శ్మశానంలో ముళ్లచెట్ల తొలగింపు, పరిశుభ్రత కార్యక్రమాలను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ పరిశీలించారు. స్మశాన వాటికలోని ముళ్ల కంప చెట్లను, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దహన సంస్కారాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా దారి వసతులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జూన్ 12వ తేదీ వరకు ఐదు దశల్లో 99 రోజులపాటు వివిధ శాఖలకు సంబంధించిన పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడిపొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వభవనాలశుభ్రత కార్యక్రమాలువిస్తృతంగా చేపట్టాలనిఅధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్‌వెంట అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఆర్డీఓ యాదగిరి, మున్సిపల్ కమిషనర్‌మురళి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



పరిశుభ్రత పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

# పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలి : జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 10 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం జీనుకుంట గ్రామంలో మంగళవారం జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి 8వ విడత పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యజమానులు తమ పశువులకుగాలికుంటు వ్యాధి నివారణ టీకా తప్పని సరిగా వేయించాలని సూచించారు. పాడిరైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహిస్తున్నాయని చెప్పారు. నేటి నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు నిర్వహించే టీకాల కార్యక్రమాన్ని జిల్లాలోని 2లక్షల 50 వేల పశువులకు టీకాలు వేసేలా పశుసంవర్ధక శాఖ అధికారులు పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన 65టీముల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు అందుకు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందర్భంగా కోరారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈసందర్భంగా యజమానుల పశువులకు టీకాలు వేయించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్లు, డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి పరిశుభ్రత కార్యక్రమాల నిర్వహణపై ఆరా తీశారు. గ్రామంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి పరిశుభ్రతకు పాటుపడాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, జినుకుంట గ్రామ సర్పంచ్ రంగినేని పుష్పలత, ఉప సర్పంచ్ కాలూరి తిరుపతమ్మ, మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

**మద్దూరు, మార్చి 10 (ప్రభాతవార్త):** ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని మద్దూరు ఎంపీడీవో రామన్న, స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మద్దూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పాలన కార్యక్రమం అమలు విధానం, చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం అమలులో భాగంగా మార్చి 6 నుంచి మార్చి 15 వరకు 99 రోజుల రోజుల పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి గ్రామా ల్లో అమలు చేయాలని డిఆర్‌డిఓ మొగులప్ప, మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవసరమైన సేవలు సమయానికి అందేలా ప్రతి శాఖ అధికారి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో వ్యవసాయం, పశుసంవర్ధక, ఆరోగ్యం తదితర శాఖల సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారిపవన్, వెటర్నరీ వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు, వ్యవసాయశాఖ అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్లు, హాజరైన అధికారులు

# గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

◆ ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం ◆ ఇంఛార్జ్ ఎంపిడిఓ రేవత్‌రెడ్డి



కంసానిపల్లిలో హైస్కూల్‌లో ఇంఛార్జ్ ఎంపిడిఓ రేవత్‌రెడ్డి

**ఉప్పునుంతల, మార్చి 10 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ రేవత్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల కార్యాచరణ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రాయిచేడ్, వెల్టూరు, కంసానిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక పారిశుద్ధ్య, పాఠశాల సందర్శన కార్యక్రమం, గ్రామంలో రోడ్డును పరిశుభ్రపరచడం, మురుగు కాల్వలలో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపు తదితర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఎంపీడీఓ తుమ్మల రేవత్ రెడ్డి తోపాటు గ్రామసర్పంచులు చింతోజు వెంకటేష్, చీమల లలితమ్మ, ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు కళావతి, ఉమాశంకర్, సురేష్, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సింగోటం పాల్గొన్నారు.

# జిల్లాలో 1,05,000 పశువులకు టీకాలు వేయాలన్నదే లక్ష్యం

◆ జిల్లా వెటర్నరీ అధికారి ఈశ్వర్ రెడ్డి ◆ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభం

**నారాయణ పేట, మార్చి 10 (ప్రభాతవార్త):** నారాయణపేట జిల్లాలో పశువుల్లో వ్యాపించే గాలి కుంటు నోటిపాద వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా వెటర్నరీ అధికారి ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 10 నుంచి ఏప్రిల్ 10 వరకు నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 1,05,000 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం 46 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కోస్గి గ్రామంలో ప్రారంభించారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, నోటి లోపల పుండ్లు, కాళ్ల వద్ద గాయాలు వంటి లక్షణాలు కనిపిస్తాయని అధికారులు తెలిపారు. వ్యాధి సోకిన పశువులు మేత తినకపోవడం, నడవడంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదుర్కొంటాయని చెప్పారు. పశువులకు సమయానికి టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని అధికారులు సూచించారు. లక్షణాలు కనిపించిన పశువులను ఇతర పశువుల నుండి వేరుగా ఉంచి వెంటనే వెటర్నరీ వైద్యులను సంప్రదించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్గిమున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, గ్రంథాలయ చైర్మన్, కోస్గి మండల పశువైద్యాధికారి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. రైతులు ఈ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులను రక్షించుకోవాలని అధికారులు కోరారు.



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

## నేడు జరిగే సదస్సుకు ఉప్పరపల్లి సర్పంచ్ ఎంపిక

**ఉప్పునుంతల, మార్చి 10 (ప్రభాతవార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం నేడు బుధవారం ఢిల్లీలో నిర్వహిస్తున్న మహిళా జాతీయ సదస్సుకు నల్లమల్ల ప్రాంత వాసి బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి పలు జిల్లాల నుంచి 16 మంది మహిళ సర్పంచులు హాజరుకానున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి సతీమణి అమెరికాలో ఎంసీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. ఇటీవలతెలంగాణ రాష్ట్రంలో జరిగిన పంచాయతీ రాజ్ ఎన్నికల్లో ఆమె కుటుంబ సభ్యుల సహకారంతో గ్రామస్తుల ఆశీర్వాదంతో గ్రామ సర్పంచ్‌గాఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఆమె భాగస్వామ్యులు చేరి గ్రామ అభివృద్ధేతమ లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. అందులో భాగంగా పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ పరిపాలన పట్ల ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన శిక్షణ శిబిరానికి 100 శాతం హాజరై ఉన్నతాధికారుల నుంచి ఉత్తమ సర్పంచ్‌గాఅవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. అదృష్టవశాత్తు కేంద్రప్రభుత్వం గ్రామపంచాయతీ పరిపాలన పట్ల ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ఎంపిక కావడం గ్రామస్తులతో పాటుమండల ప్రజలుప్రత్యేకంగా ఆమెను అభినందించారు. విద్యావంతురాలు, ఉన్నతమైన కుటుంబంలో ఎదిగి గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నతమగ్రామ సర్పంచ్ ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సు ఎంపికైన ఉప్పరిపల్లి సర్పంచు బొజ్జ గీత అమరేందర్ రెడ్డి

## గ్రామాల పరిశుభ్రతకై ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**వెల్దండ, మార్చి 10 (ప్రభాతవార్త):** గ్రామాల అభివృద్ధి పరిశుభ్రతకై ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ప్రభుత్వం తీసుకొచ్చిందని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు శుభ్రం తడి ప్రదేశాలలో బ్లీచింగ్ ఫౌడర్ వేసి పరిశుభ్రతను పాటించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీను ముదిరాజ్, కొండయ్య, రంగనాథం, ఆనంద్, రాజు, శ్రీను, రమేష్, మసిగుండ్ల వెంకటేష్, బాదేపల్లి రమేష్, శేఖర్, పురుషోత్తంచారి, రాఘవరెడ్డి, చీముల తిరుపతి రెడ్డి, పంచాయితీ కార్యదర్శి గిరిగౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వైద్య శిబిరం

**వెల్దండ, మార్చి 10 (ప్రభాతవార్త):** ప్రజాపాలనలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సింధు ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులను వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రమణ కుమార్, కవిత, చంద్, సూపర్వైజర్లు మనోజ్ కుమార్, మురళీకృష్ణ, కవిత, ఏఎన్ఎం జాంగిర్, బి.లక్ష్మీకళ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## పాఠశాలపై ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించిన అధికారులు

**కోయిలకొండ మార్చి 10, ప్రభాతవార్త:** కోయిలకొండ మండలం ఇబ్రహీం నగర్ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల పై ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ వైర్లను జిల్లా విద్యుత్ శాఖ అధికారి తన సిబ్బందితో కలిసి పరిశీలించి వెంటనే వైర్లను తొలగించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కోళ్ల నరసింహులు మంగళవారంఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలపై ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్తు వైర్ల గురించి అధికారులకు తెలియజేయగానే వెంటనే స్పందించి విద్యుత్ వైర్లను తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామస్తులు విద్యుత్ సమస్యపై విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## కంసానిపల్లి హైస్కూల్‌లో వీడ్కోలు సమావేశం

**ఉప్పునుంతల, మార్చి10 (ప్రభాతవార్త):** మండలంలోని కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలకు అనుబంధం ఉన్న విద్యార్థులు పదో తరగతి ముగియడంతో వారు పాఠశాలను వీడి వార్షిక పరీక్షల్లో హాజరు కావడం జరుగుతుందని విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో మెలిగారని, భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పలువురు వారిని ఆశీర్వదించారు. పాఠశాల విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేసుకొని పై చదువుల కోసం వెళ్తున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ కొనియాడారు. అనంతరం విద్యార్థులు ఒక్కొక్కరుగా పాఠశాల ఉపాధ్యాయులు వారు అందించిన విద్యను తాము మరువలేమని, భవిష్యత్తులో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యను అందించిన ఉపాధ్యాయులను తాము జీవితంలో మరువలేమని వారి సేవలను కొనియాడుతూ విద్యార్థులు కంటతడి పెట్టారు. ఈ కార్యక్రమానికి ఇంఛార్జి ఎంపిడిఓ రేవత్ రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ సిమర్ల లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడి పూరి మల్లికార్జున్, కట్ట మల్లారెడ్డి, భాగ్యరేఖ, మహేశ్వరి, బాలకృష్ణ, కట్ట ప్రభాకర్ రెడ్డి, సలీం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇసుక నిల్వలు సీజ్ చేసిన తహసీల్దార్

**ఉప్పునుంతల, మార్చి10 (ప్రభాతవార్త) :** మండలంలో ప్రవహిస్తున్న దుందుభి వాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నివారించాలని తహసీల్దార్ అద్దంకి సునీత ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మంగళవారం మండలంలోని మొల్గర సమయంలో సోమవారం అర్ధరాత్రి అక్రమంగా తరలించిన ఇసుక రీచ్‌ను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ అద్దంకి సునీత సందర్శించిన సమయంలో అక్కడే ఇసుకను లోడింగ్ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకుఅప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అద్దంకి సునీత మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపేరిట అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ అద్దంకి సునీత తోపాటు జిపిఓ ఆంజనేయులు, పోలీసులు ఉన్నారు.

## గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తా

వెల్టూర్ సర్పంచ్ చింతోజు వెంకటేష్

**ఉప్పునుంతల, మార్చి 10 (ప్రభాతవార్త):** తమ గ్రామాభివృద్ధి కోసం పాటుపడతానని, అధికారులు సహాయ సహకారాలు అందించాలని వెల్టూరు సర్పంచ్ చింతోజు వెంకటేష్ కోరారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఇంఛార్జి ఎంపిడిఓ రేవత్ రెడ్డి వెల్టూరు, రాయిచేడ్, కంసానిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెల్టూర్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఇంఛార్జి ఎంపిడిఓ రేవత్ రెడ్డి ని గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్యలు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉమా శంకర్, కళావతి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సింగోటం తదితరులు పాల్గొన్నారు.

## స్థల దాతకు ఘన సన్మానం

**ఉప్పునుంతల, మార్చి10 (ప్రభాతవార్త):** మండలంలోని మర్రి పల్లి గ్రామంలో మినీ అంగన్‌వాడి కేంద్రం నిర్మాణం కోసం ముందు కొచ్చిన స్థలదాత పాక లక్ష్మయ్య ను గ్రామ సర్పంచ్ సత్తు భూపాల్‌రావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మినీ అంగన్‌వాడి కేంద్రం నిర్మాణం కోసం కృషి చేసిన గ్రామ సర్పంచ్ సత్తు భూపాల్ రావు, ఉప సర్పంచ్ భూమి పాగా నరసయ్య, వార్డ్ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

**అయ్యవారిపల్లిలో:** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు స్థానిక నాయకులు గ్రామ సర్పంచ్ జిల్లెల జగత్‌రెడ్డి నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు టేబుల్, కుర్చీలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నగ్రామ సర్పంచ్, జిల్లెల్ల జగత్ రెడ్డిని, గ్రామస్థులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు జంగయ్య వారి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.




మర్రిపల్లిలో స్థలదాతను సన్మానిస్తున్న సర్పంచ్ సత్తు భూపాల్ రావు

# గాలి వార్తలు పట్టుకొని అడ్డగోలుగా మాట్లాడితే ఎలా కేటీఆర్..

- జీనుగురాల పల్లె ప్రకృతి ఘటనపై పూర్తి సమాచారం లేకుండా మాట్లాడడం సరికాదు
- రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
- రూ.30లక్షల నిధులతో ఆహార ధాన్యాల నిలువ గోదాంకు భూమి పూజ


గోదాంకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,మార్చి 10 ప్రభాతవార్త:** గత 15 రోజుల క్రిందట జీనుగురాల గ్రామంలోని పల్లె ప్రకృతి ఘటనలో భాగంగా పూర్తి సమాచారం లేకుండా జీనుగురాలలో ఎవరో ఇచ్చిన గాలివార్తలను ఆధారంగా చేసుకుని, బిఆర్ఎస్ కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడడం సరికాదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం దేవరకద్ర మండల పరిధిలోని జీనుగురాల గ్రామంలో 30 లక్షల నిధులతో ఆహార ధాన్యాల నిలువ గోదాం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించాల్సిన నాయకులు తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని అన్నారు.ప్రజల ముందుకు వచ్చే, ముందు నిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. కొద్ది రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ జాడ ఉండదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు ఆ పార్టీకి గట్టి బుద్ధి చెప్పారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, దోపిడీలను ప్రజలు గుర్తించుకొని ఓటు ద్వారా తమ తీర్పును వెల్లడించారని తెలిపారు. ఇకపై ప్రజల ఆశయాలకు అనుగుణంగా జీనుగురాల గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, రైతులకు వరి ధాన్యంపై 500బోనాలు ఇస్తున్నామని,గత ప్రభుత్వం నిలిపివేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించిందని, పంట భీమ పథకాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేస్తే పంటల భీమా పథకాన్ని సైతం పునరుద్ధరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతంగానికి అండగా నిలిచారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను ఎత్తివేసిందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పనిముట్లు ఇస్తున్నామని,రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలుస్తున్నామన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు. అనంతరం సీసీ కుంట, దేవరకద్ర ,కౌకుంట్ల, మండలాల రైతులకు స్ప్రిన్కర్స్ పంపిణీ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నటువంటి పథకాలను రైతులు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు, ఉప సర్పంచ్ నరహరి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ,ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ దీపికా రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,మార్చి 10,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు.మంగళవారం భూత్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మూడు మండలాలు (భూత్పూర్,మూసాపేట,అడ్డాకుల)లకు చెందిన రైతులకు స్ప్రింక్లర్లు, హార్టికల్చర్ ఎక్విప్‌మెంట్స్ మెటీరియల్స్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు.అధికారం చేపట్టాక ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫి,వరి ధాన్యంపై రు.500బోనస్,గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం,పంట బీమా పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్దరించారని పేర్కొన్నారు.గత ప్రభుత్వం రైతు బంధు నెపంతో రైతులకిచ్చే అన్ని సబ్సిడీలను ఎత్తివేయగా, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటన్నింటిని పునరుద్దరించి అమలు చేస్తోందని పేర్కొన్నారు.రైతుల శ్రేయస్సుకోసం పనిచేస్తున్న నిజమైన రైతు ప్రభుత్వం కాంగ్రెస్సేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌ముడావత్ బాలకోటి, మండల కాంగ్రెస్‌అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల స్పెషలాఫీసర్ వేణుగోపాల్,మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఇతర అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ...**

భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ నూతన చైర్మన్ ఛాంబర్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభిం చారు.అత్యాధునికంగా రూపుదిద్దిన ఛాంబర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు నూతన మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి పూలచెట్టును అందించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ లిక్కిసూర్యకళతో పాటు కౌన్సిలర్లు కెంద్యాల పద్మ(5వ వార్డు) పాల్యావత్ లాల్య(మూడోవార్డు),లత సూరన్న గారి (ఏడో వార్డు)లతో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు అందజేత

**జడ్చర్ల, మార్చి 10 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు సెట్విన్ కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ కోనేటి పుష్పలత కేక్ కట్ చేసి 3 నెలలు వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లత, సెట్విన్ అధికారి విజయకుమార్,మాజీ సర్పంచ్ బుక్కా వెంకటేశం,మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**నర్వ, మార్చి 10 ప్రభాతవార్త:** నర్వ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాడు విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా సన, డిఈఓగా కల్పన, ఎంఈఓ గా రేణుక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సాయికీర్తి, పూజ తో పాటు మరో 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతులకు పాఠాలు బోధించారు.ఈ కార్యక్రమంలో నర్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునిత, సీనియర్ ఉపాధ్యాయులు మధుసూదన్,మన్యం,మల్లేష్,రాజు,ప్రకాష్,శ్రీనివాసులు,విజయ్ కుమార్, అబ్దుల్‌సలీం, సురేష్,యాదమ్మ, స్వరూప,స్నేహ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచులను సన్మానించిన అధికారులు

**రాజాపూర్, మార్చి 10 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు విధిగా పాల్గొంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే మహిళా దినోత్సవం రోజున కొందరు అధికారులు అందుబాటులో లేనందున మంగళవారం అందరూ మండల అధికారులు అందుబాటులో ఉండడంతో ఆయా గ్రామాల మహిళా సర్పంచులను సన్మానించినట్లు మండల అధికారులు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 5వ రోజు మురుగునీటి కాలువల శుభ్రం చేయుట, రోడ్లను శుభ్రపరచినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలతహసిల్దార్ రాధాకృష్ణ, ఎస్ఐ రాజశేఖర్, ఎంపీఓ వెంకట్రాములు, మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**దేవరకద్ర,మార్చి 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడై బిఆర్ఎస్ పార్టీ దేవరకద్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ డీజే రాజు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో కలవడంతో, బిఆర్ఎస్‌కు కష్టకాలమని చెప్పవచ్చు. ఈ సందర్భంగా డీజే రాజు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం అభివృదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఆ ఆలోచనతోనే తాను పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి ,వైస్ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ పారుక్ అలీ, జిఎంఆర్ యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్, రోడ్ల సమస్యలను పరిష్కరించాలి

**మజీద్‌లను సందర్శించిన డిప్యూటీ మేయర్ ఎం.సురేందర్ రెడ్డి**

**మహబూబ్‌నగర్, మార్చి 10 ప్రభాతవార్త:** మజీద్ ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, విద్యుత్, రోడ్ల సమస్యలను తొలగించాలని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ బండమీదిపల్లి ప్రాంతంలోని పాలమూరు యూనివర్సిటీ పక్కన ఉన్న మజీద్ ఏఅబేదా బసీర్, మస్జిద్ ఏఅలీ మజీద్ మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా మజీద్ కు సంబంధించిన విద్యుత్, రోడ్లు, నీటి సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మస్జిద్ పెద్దలు,మస్జిద్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

**సర్పంచ్ భర్త పై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన పెద్దదర్పల్లి గ్రామస్తులు**

**హన్వాడ, మార్చి 10 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దదర్పల్లి గ్రామంలో సర్పంచ్ భర్త ఆధిపత్యం ప్రదర్శిస్తూ గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు, వార్డు సభ్యులు హన్వాడ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామ పాలనలో నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామంలో పంచాయతీ వ్యవహారాల్లో సర్పంచ్ భర్త అధికంగా జోక్యం చేసుకుంటున్నారని, దీనివల్ల గ్రామంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ నిబంధ నలను అమలు చేయాలని పంచా యతీ కార్యదర్శి సూచించినందుకు ఆయనపై గ్రామం నుంచి తొలగించాలని ఫిర్యాదు చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. గ్రామంలో జరుగుతున్న పరిణామాలపై అధికారులు పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు.

**WANTED**

Wanted **PRT/SGT (Telugu, Hindi, English, Maths, Science and Social Sciences) each one post, PPRT/JBT/NTT-2 posts, LDC (Ministerial Staff) -1 post for 2026-27** at BBKM DAV High School, Perur Village, Kowkuntla Mandal, Mahabubnagar District, Telangana 509 219 (Managed by DAV CMC, Delhi). **DAVCBT 2026 QUALIFIED CANDIDATES ONLY NEED TO APPLY.** Resumes with copies of certificates to be sent on or bore 20.03.2026 to bbkmdavhs@gmail.com Candidates will be selected after Demo cum Interview. No TA/DA will be paid. Contact: **9000374600.**

# జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి

**రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**పీఎంశ్రీ జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయురాలు జి. విజయలక్ష్మికి ఘనంగా వీడ్కోలు**


మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి


పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

**దామరగిద్ద, మార్చి 10 ప్రభాతవార్త:** జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దామరగిద్ద మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు జి.విజయలక్ష్మి వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి విజయలక్ష్మి–పోషల్ నారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మనకు విద్య నేర్పిన గురువులకు ఘనంగా వీడ్కోలు పలికే సంస్కృతి మనదని అన్నారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రులతో సమానంగా గురువులను గౌరవించాలని సూచించారు.విద్యార్థులను సమాజంలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యత గురువులదేనని తెలిపారు.తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటే విద్యార్థులు ఉత్తమంగా రాణించగలరని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. మేము ఏదైనా సాధించగల మనే సంకల్పం విద్యార్థుల్లో ఉండాలని, రాబోయే పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే శక్తి వారికిరావాలని మంత్రి ఆకాంక్షించారు. సమయం చాలా విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. తన కుటుంబ సభ్యు ల్లో ఒకరైన తన అల్లుడు రాహుల్ ఐఏఎస్ ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ లో కలెక్టరుగా పనిచేస్తున్నారని, కష్టపడి చదివి ఆ స్థాయికి చేరుకున్నాడని తెలిపారు. తాను వ్యవస్థను చదివిన వ్యక్తిగా బీద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.మక్తల్– నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని, ఈ ప్రాంత అభివృద్ధిలో తన పాత్ర ఉండాలని భావిస్తున్నానని తెలిపారు. ఎత్తిపోతల పథకం వల్ల భూమి కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 20లక్షలు ఇచ్చి ఆదుకున్నదని గుర్తు చేశారు.ఈ ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతతాను తీసుకుంటానని చెప్పారు. గతంలో ఈ ప్రాంతం నుండి జీవనోపాధి కోసం వలసలు వెళ్లేవారని, ఇప్పుడు ఇక్కడికే వలసలు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మెయిన్ రోడ్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ గోడ, స్టేజి నిర్మాణానికి వెంటనే ఆదేశాలు ఇచ్చానని, రాబోయే అకాడమిక్ సంవత్సరానికి ముందే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ కలెక్టర్ రాహుల్ ఐఏఎస్, నారాయణపేట అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఆర్డీవో రాంచందర్ నాయక్, డీఈఓ గోవింద రాజులు, ఎంఈఓ ఎస్.కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సురేష్,మండల తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో సాయి లక్ష్మి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, దామరగిద్ద సర్పంచ్ కనికిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సావిత్రి బాయి ఫూలే మహిళలకు ఆదర్శం


సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, మార్చి10 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం యూనివర్సిటీ పీజీ కాలేజీలో సావిత్రిబాయి పూలే 139 వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. డి. మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. డా. డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ 150 సంవత్సరాల క్రితం పరిస్థితులు మహిళలు విద్యకు దూరంగా ఉన్నటువంటి కాలములో జ్యోతిరావు పూలే స్వయంగా తన భార్యకి చదువు నేర్పించి తరువాత పెదప్రజలు జీవించే ప్రదేశాలలోకి వెళ్లి సావిత్రి భాయి పూలే మహిళలకు చదువు నేర్పించేవారు. అలా కొన్ని పాఠశాలలు ఏర్పాటు చేసి. మహిళలకు చదువు నేర్పించారన్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ మహిళలు సావిత్రి భాయ్ పూలే చూపిన మార్గంలో నడవాలని ప్రస్తుతం మహిళలు సావిత్రి భాయ్ పూలేని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదువుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో డా.బి. పర్వతాలు కె. మాధురి మెహన్, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నర్వ, మార్చి10 ప్రభాతవార్త:** నేటి మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక సావిత్రి భాయి పూలే అని,ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం రాయికోడ్ గ్రామ అధ్యక్షులు మల్లన్ కోటి శంకర్ అన్నారు. సావిత్రిబాయి పూలే 149వ వర్ధంతి సందర్భంగా రాయికోడ్ గ్రామం సావిత్రి బాయి పూలే జ్యోతి రావు పూలే విగ్రహాల వద్ద ఆమె విగ్రహానికి గ్రామస్తులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మల్లన్ కోటి శంకర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే త్యాగాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతి మహిళ అలవర్చుకోవాలన్నారు.పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళ్తున్నారంటే అది సావిత్రిభాయి పూలేఆనాడు వేసిన సాహసోపేతమైన పోరాటంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి రమేష్, గ్రామ ఉప సర్పంచి మ్యాతరిగోపాల్,గ్రామస్తులు కొండానరసింహా స్వామి,మందీపుల నారాయణ రెడ్డి, రాజు వార్డు మెంబర్, మేస్త్రీ ఖాజా,హన్మన్న,సయ్యద్ ఖాజా మైనోద్దీన్,పుల్లరిరాజు,మేస్త్రి, భీమేశ్,ఉప్పరి రవికుమార్, యన్ నరసింహా విద్యావాలంటీర్,రామాంజనేయులు గౌడ్, మైబు,ఎద్దుల రవి,యువకులు శివ శంకర్, ఎం.అనీల్,కే చింటూ,నరసింహా విద్యార్థులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు


పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసిన దృశ్యం

**నర్వ, మార్చి10 ప్రభాతవార్త:** పదేళ్ల పాఠశాల ప్రయాణం...వెలకట్టలేని స్నేహాలు.. కన్నతండ్రిలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు.. ఇవన్నీ ఒక ఎత్తైతే,ఇప్పుడు ఆగడప దాటి వెళ్తున్నామన్న బాధమరో ఎత్తు.నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం అత్యంత భావోద్వేగాల మధ్య జరిగింది.9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఈ వీడ్కోలు సమావేశం కేవలం వేడుకగానే కాకుండాఆత్మీయ కలయికగా మారింది.పాఠశాల ప్రాంగణంలో గడిపిన ప్రతి క్షణం విద్యార్థుల కళ్లముందు కదలాడాయి.తమను తీర్చి దిద్దిన ఉపాధ్యాయులకు నమస్కరిస్తూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు నిర్వహించి పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు.విద్యార్థుల సేవలుతరగతి గదిలో సందడి,ఆటస్థలంలో కేరింతలు,భోజనాలు పంచుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు చెప్పుకున్నారు.రేపు పాఠశాల గంట మోగితే తాము ఇక్కడ ఉండమన్న ఆలోచన వారినికలిచివేసింది.అయితేతమ సీనియర్ల భవిష్యత్ బంగారుమయంగాఉండాలని9వ తరగతివిద్యార్థులుఆకాంక్షి ంచివారిని సాగనంపారు.

**వీడ్కోలు అంటే విడిపోవడం కాదు :** కొత్త శిఖరాలను అధిరోహించేందుకు చేసే మరో ప్రయాణం అని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు.పదో తరగతి విద్యార్థులు కూడా పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులు,సహ విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలుసాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. క్రమశిక్షణ,పట్టుదల,లక్ష్యసాధనతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో నర్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునిత, సీనియర్ ఉపాధ్యాయులు మధుసూదన్, మన్యం,మల్లేష్, రాజు, ప్రకాష్, శ్రీనివాసులు, విజయ్ కుమార్, అబ్దుల్ సలీం, సురేష్, యాదమ్మ, స్వరూప,స్నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ అరికడదాం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన కేసులు నమోదు కాలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు దీనిపై అవగాహన కల్పించాలని, ఎవరైనా గంజాయి మొక్కలను అక్రమంగా పెంచితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు తెలియజేయాలని సూచించారు. విద్యా శాఖ అధికారులు పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రతి పాఠశాలలో 6 నుండి 9వ తరగతి విద్యార్థుల కోసం "ప్రహరీ" క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారి ద్వారా పాఠశాలలో మత్తు పదార్థాల వ్యసనం, దాని దుష్ప్రభావాలపై ఇతర విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అదనపు ఎస్పీ ఎస్.బి. రత్నం, డిసిఆర్‌బి డిఎస్‌పి రమణారెడ్డి,మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, సీఎంఓ సుధాకర్‌రెడ్డి,వైద్యకళాశాల,వివిధ జూనియర్,డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండానే ఎగరాలి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొని మాట్లాడారు.పార్లమెంట్ లీడర్ ఆఫ్ అపోజిషన్ రాహుల్ గాంధీని బావి భారత ప్రధాని గా చేసేంతవరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్విరామంగా శ్రమించాలని అందుకు ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న గ్రామ మండల స్థాయి కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని వారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా, నాయకులుగా పార్టీ తరఫున ఏర్పాటు చేసే వివిధ విభాగంలో ఉండే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ పార్టీపరమైన ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని, పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను నిరక్ష్యం చేయకుండా ప్రతికార్యక్రమంలో పాల్గొనాలనివారు సూచించారు. పార్టీ నాయకులుగా కార్యకర్తలుగా గ్రామ అధ్యక్షులుగా మండలాధ్యక్షులుగా వివిధ ఆర్గనైజేషన్‌లో ఉండి పార్టీ కార్యక్రమాల పట్ల మనకెందుకులే అనే ధోరణిని విడనాడాలని, మనకెందుకులే అనుకునే వారెవరు కూడా రాజకీయంగా రాణించలేరని, అలాంటి వారి సహవాసంలో మనం ఉండకూడదన్నారు.సామాజిక మాధ్యమాల్లో వెనకబడి పోతున్నామని ప్రభుత్వం చేసే పనులను గ్రామంలోని ప్రతి గడపకు చేరవేయాల్సిన బాధ్యత మనకుందని వారు సూచించారు.ఈ సందర్భంగా వారు ఖిల్లా ఘణపురం మండలం,పెద్దమందడి గ్రామ అధ్యక్షులకు సంబంధించిన టువంటి ఆశావాహుల పేర్లను వారు సేకరించారు. అధ్యక్ష పదవి కోసం ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు దరఖాస్తు చేసుకోవడంతో దరఖాస్తుదారుల వివరాల పూర్వాపరాలను పరిశీలించి కమిటీని త్వరలోనే ప్రకటించినట్లు వారు తెలిపారు తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ జర్నల్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, వీతీది జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, వెంకటస్వామి, రమేష్ గౌడ్, వేణుగోపాలకృష్ణ, మండలాధ్యక్షులు విజయ్ కుమార్, పెంటయ్య యాదవ్,సాయి చరణ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, క్యామ వెంకటయ్య, వెంకట్రావు, ఐసత్యరెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య,న్యాయవాది తిరుపతయ్య, నందిమల్ల త్రినాథ్, మొగిలి సత్య రెడ్డి, చీర్ల జనార్ధన్, టైలర్ రవి, ఆయా గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచ్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి పనులకు అందరూ సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సిలర్ గడ్డం ప్రేమ్‌కుమార్,ఐదో వార్డు కౌన్సిలర్ కెంద్యాల పద్మ,ఆరో వార్డు కౌన్సిలర్ కెంద్యాలశ్రీనివాసులు,ఏడో వార్డుకౌన్సిలర్ లత సూరన్న గారి,తొమ్మిదో వార్డు కౌన్సిలర్ చంద్రకళలతో పాటు వెల్కిచర్ల సర్పంచి మలిశెట్టి వెంకటేష్,పోతులమడుగు సర్పంచి గంగుల ఆనంద్‌రెడ్డి,కప్పెట సర్పంచి మాసగౌడ్,భట్టుపల్లి ఏవీఆర్‌కాలనీ సర్పంచి తారునాయక్, కరివెన సర్పంచి రాణి,భట్టుపల్లి సర్పంచి లక్ష్మమ్మ,హస్నాపూర్ సర్పంచి తాళ్లగడ్డ సంజీవరెడ్డి,రావులపల్లి సర్పంచి తొండ శ్రీశైలంలతో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,నాయకులు కెంద్యాల మశ్చందర్,రఘుపతిరెడ్డి,కెంద్యాల రాజేష్,కెంద్యాల నరేందర్,బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప,కోరెపవన్ తదితరులతో పాటు మున్సిపాలిటీ ఆర్పీలు సువర్ణ,విజయలక్ష్మి,ధనలక్ష్మి,అనురాధ,కల్పన పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు :** ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో పలు పార్టీలకు చెందిన సర్పంచులు కాంగ్రెస్‌లో చేరారు.వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రావులపల్లి సర్పంచి తొండ శ్రీశైలం,ఉపసర్పంచి లక్ష్మమ్మ ఇతర పార్టీల నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో**

## ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం కలిసికట్టుగా పనిచేస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లులక్ష్మీనారాయణ (రెవిన్యూ),నర్సింగరావు (స్థానిక సంస్థలు), అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**గువ్వలోనిపల్లి సర్పంచ్ శ్రీదేవి నరసింహులు**

**ఉప్పునుంతల, మార్చి 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా చేరాలని గువ్వలోని పల్లి సర్పంచ్ శ్రీదేవి నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం గువ్వలోని పల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో నెలకొన్న ఆపరిశుభ్రతను తొలగించేందుకుఈకార్యక్రమం ఎంతో దోహదపడుతుందని, గ్రామాభివృద్ధి కోసం తమకు ప్రజల సహకారం అవసరమని, గ్రామ ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి పాటు పడతామని పేర్కొన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్ల పరిశుభ్రత, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదరం తొలగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీదేవి నరసింహులు, పంచాయతీ కార్యదర్శి గణేష్, గ్రామంలోని వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**భూత్పూర్,మార్చి 10,ప్రభాతవార్త:** మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు,ఉద్యోగులు మంగళవారం(మార్చి 10)నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాలల్లోని గ్రామాలు,పట్టణాలలో వైద్యశిబిరాలు నిర్వహించి పశువుల్లో తరచూ సోకే గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నారు.ఇందులో భాగంగా మంగళవారం ఈ వైద్యశిబిరాలను పట్టణ కేంద్రంలోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.